• వంతెన లేక ఇబ్బందులు

బురదలో ఇరుక్కుపోయిన ఆటో

సిరికొండ మండలం తుమ్మలపాడ్ గ్రామానికి వంతెన లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-ఇచ్చోడ, జనవరి 12

• రాములోరి అక్షింతలతో శోభాయాత్ర

అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠలో భాగంగా ఊరూరా అక్షింతల కార్యక్రమం వైభవంగా జరుగుతోంది. మండల కేంద్రంలో భక్తులు, మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

-ఇంద్రవెల్లి, జనవరి 12

పార్టీ మారడం సరికాదు

మాట్లాడుతున్న గణేశ్ యాదవ్

జైనథ్, జనవరి 12: జైనథ్ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి బీఆర్ఎస్‌లో అంచెలంచెలుగా ఎదిగి మండల పార్టీ అధ్యక్షుడిగా, జడ్పీటీసీగా ఎదిగి చివరకు కాంగ్రెస్ పార్టీలో చేరడం సరి కాదని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గణేశ్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ప్రజల్లో ఆదరణ, గౌరవం ఆయన పెట్టిన భిక్షను వదిలి కాంగ్రెస్‌లో చేరడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, సర్పంచ్ దేవన్న, పాల్గొన్నారు.

యువకులు లక్ష్యాలు సాధించాలి

జెండా ఊపి 2కే రన్ ప్రారంభిస్తున్న ఎస్ఐ రాము

బోథ్, జనవరి 12: యువకులు తమ లక్ష్యాలు నిర్దేశించుకొని వాటిని సాధించాలని ఎస్ఐ రాము అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా శుక్రవారం బోథ్‌లో మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2కే రన్ ఆర్మీ, నేవి ఎంపికలకు వెళ్లే వారికి చాలా ఉపయోగపడుతుందన్నారు. మొదటి బహుమతి బాబెర గ్రామానికి చెందిన భీంరావ్, రెండో బహుమతి వర్షిట్, మూడో బహుమతి శివరాజ్(బోథ్) గెలుపొందారు. కార్యక్రమంలో యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 12: జిల్లా కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అశ్విత, జోష్నిక, రిషిత, రుచిత, శృతి, జహీర్, నిశాంత్, సూర్య జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో నిర్వహించిన ఉపన్యాస, ఫొటోగ్రఫీ, పోస్టర్ మేకింగ్, పాటల పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ చాటారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జరిగిన జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. అదేవిధంగా డిప్లమా సివిల్ ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న డీ ఐశ్వర్య రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడల్లో చెస్ విభాగంలో ద్వితీయ బహుమతి గెలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ, అధ్యాపక, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాలను వదిలేస్తున్నాం

వాహనాలకు నంబర్‌ప్లేట్ బిగించి తీసుకెళ్తున్న వాహనదారులు

ఎదులాపురం, జనవరి 12 : ప్రత్యేక డ్రైవ్‌లో స్వాధీనం చేసుకున్న నంబర్, రిజిస్ట్రేషన్ లేని ద్విచక్రవాహనాలకు నంబర్ ప్లేట్ బిగించి పత్రాలను చూసి వదిలేస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ సాయన్న అన్నారు. శుక్రవారం స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయన్న మాట్లాడుతూ నంబర్‌ప్లేట్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసుకొని, పెండింగ్ చలాన్ కట్టించిన తర్వాత వాటిని వదిలేస్తున్నామన్నారు. వాహనదారులు క్రమం తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఏఎస్ఐ అరుణ్‌ఖాన్, ప్రకాశ్, కానిస్టేబుళ్లు రాజేశ్, వినోద్, ఫిరోజ్, మంగళ్‌సింగ్, కిషన్ ఉన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



తాంసి: కప్పర్లలో నివాళులర్పిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఘనంగా జయంతి
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 12 : జిల్లా వ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాంతినగర్‌కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జాకీర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దయాకర్, ఎండీ అశ్ఫ్ అలీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్, జనవరి 12 : గుడిహత్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూరజ్ సింగ్, స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కోకన్వీనర్ నాగుల సతీశ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సునీల్, బీజేపీ మండలాధ్యక్షుడు తరుణ్ గిత్తే, అధ్యాపకులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి, జనవరి 12: మండల కేంద్రంలో ఆయా పార్టీల నాయకులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కనక తుకారాం, నాయకులు దీపక్ సింగ్‌షేకవత్, రాజలింగు పాల్గొన్నారు.

తాంసి, జనవరి 12 : తలమడుగు, తాంసి మండలాల్లోని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామి వివేకానంద చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖోడద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు వివేకానందుడి గొప్పతనం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆకుల భూమయ్య, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీవో సుధీర్ రెడ్డి, సర్పంచ్‌లు, బీఆర్ఎస్, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వివేకానందుడి జీవిత చరిత్ర ఆదర్శనీయం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 12: వివేకానందుడి జీవిత చరిత్ర నేటి యువతకు ఆదర్శనీయమని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని న్యూ హౌసింగ్ బోర్డు వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్ నాయక్, నర్సింగ్, వెంకన్న పాల్గొన్నారు.

జైనథ్(బేల), జనవరి 12: మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ హరీశ్ రెడ్డి, ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ ఓం ప్రకాశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ ఠాక్రే, మండలాధ్యక్షుడు దత్తా నిక్కం, సర్పంచ్ రాకేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్, జనవరి 12 : పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరై వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు బాల శంకర్ కృష్ణ, గణేశ్, శ్రీకాంత్, రాజు, సురేశ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, జనవరి 12: హస్నాపూర్ గ్రామంలో స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రారంభించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది జగన్, వైద్య సిబ్బంది, వివేకానంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాగులు పంపిణీ

ఉట్నూర్, జనవరి 12 : వివేకానంద జయంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో ఆదివాసీ పర్ధాన్ ఎంప్లాయిస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడ నగేశ్ అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్ధాన్ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకులు మరప గోవిందరావ్, మడావి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, యువకులు ఆత్రం నారాయణ, మడావి బాలాజీ, హరిప్రసాద్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, జనవరి 12 : అట్రాసిటీ కేసుల్లో బాధితులైన వ్యక్తులకు ప్రభుత్వం తరపున ఆర్థికంగా, పునరావాసం కల్పించుటకు విజిలెన్స్, మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులను ఎంపిక చేస్తున్నామని డీఎస్సీడీవో భగత్ సునీతా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు, సామాజిక కార్యకర్త, స్వచ్ఛంద సంస్థలు ఈ నెల 25వ తేదీలోగా జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9440628538ను సంప్రదించాలని సూచించారు.

రేషన్ డీలర్లతో సమావేశం

బోథ్, జనవరి 12 : తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్ చందర్ శుక్రవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. దుకాణాల వారీగా పంపిణీ చేసిన బియ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆధార్ ప్రక్రియ నమోదు వివరాలు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బోథ్, జనవరి 12 : బోథ్‌లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించి ఐదేండ్లు కావస్తున్న ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదని పలు పార్టీల నాయకులు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తాకు వినతిపత్రం ఇచ్చారు. రూ.లక్షల్లో వేలం పలుకుతున్న తైబజార్ వార సంతలో కనీస వసతులు కల్పించకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు తాగునీరు, మూత్రశాలలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వార సంతలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ నాయకులు జక్కుల వెంకటేశ్, రవి, నారాయణ ఉన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

పనులను పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్, జనవరి 12: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమ్రం భీం ప్రాంగణంలో ఖేలో ఇండియా నేషనల్ ఖోఖో పోటీలకు ఎంపికైన అంజన్నను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. జాతీయ స్థాయిలో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ, వసతులు కల్పించామన్నారు. అనంతరం కుమ్రంభీం వేదికగా త్వరలో నిర్వహించనున్న ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ మీట్ పనులను పర్యవేక్షించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు సుమారు 5వేల మంది క్రీడాకారులు వివిధ ప్రాంతాల నుంచి రానున్న నేపథ్యంలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, గిరిజన జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, పీహెచ్‌వో సందీప్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

ఎస్పీ గౌస్ అలంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

ఎదులాపురం, జనవరి 12 : నూతనంగా జిల్లా ఎస్పీగా గౌస్ అలం బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో టీఎన్జీవోస్ ఆదిలాబాద్ యూనియన్ నాయకులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, ఎడ్ల నవీన్ కుమార్, సభ్యులు తిర్మల్ రెడ్డి, గంగాధర్, దేవేందర్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ ఉన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరి గంగాధర్ ఎన్నికయ్యారు. శుక్రవారం టీఎన్జీవోస్ భవనంలో ఎన్నికైన గంగాధర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, సభ్యులు తిర్మల్ రెడ్డి, గోపి, నారాయణ, చంద్రశేఖర్, రూరల్ అధ్యక్షుడు ప్రవీణ్, పట్టణ కార్యదర్శి అరుణ్, సభ్యులు, డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సద్దర్ అలీ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జైనథ్, జనవరి 12: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ ఆత్మారాం అన్నారు. శుక్రవారం ఆనంద్‌పూర్ గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలతో పాటు మూఢ నమ్మకాలను విశ్వసించొద్దని సూచించారు. సరిహద్దు గ్రామాల్లో ప్రజలు సీసీ కెమెరాలను పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఇచ్చోడ, జనవరి 12 : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి ఆకుల సాగర్ అన్నారు. శుక్రవారం దుబార్‌పేట్ గ్రామంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుధ, పద్మ, ఆశ, ఉషాబాయి, భీంబాయి, సునీత పాల్గొన్నారు.

పనితీరే ప్రామాణికం

బజార్‌హత్నూర్: ఎంపీడీవోతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

బజార్‌హత్నూర్, జనవరి 12: ప్రభుత్వ ఆదేశాల మేరకు నాలుగేళ్లు పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణకు పనితీరే ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. జాతర్ల, చందునాయక్‌తండా, గిరిజాయి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై సంబంధిత రికార్డులను ఆమె పరిశీలించారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరే వారి క్రమబద్ధీకరణకు పునాది అని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ప్రక్రియ జిల్లాలోనే ప్రథమంగా 100 శాతం పూర్తి చేసినందుకు తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో రాధ, ఎంపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లను ఆమె అభినందించారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

బోథ్, జనవరి 12 : బోథ్ మండల పరిషత్ కార్యాలయంలో అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శుక్రవారం అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా పరిశీలించారు. పంచాయతీల వారీగా వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో జీవన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

హీరాసుక్కా జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 12: రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌ను జాగృతి చేసేందుకు సమాజ్ పెద్దలుగా తమవంతుగా కృషి చేస్తున్నామని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ అడ్‌హక్ కమిటీ జిల్లా నాయకుడు మాధవ్ అన్నారు. శుక్రవారం మావల మండలం వాఘాపూర్ గ్రామంలో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసుల ఆరాధ్య దైవమైన హీరా సుక్కా జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. శనివారం ఇంద్రవెల్లిలో నిర్వహించే సన్నాహక సమావేశానికి ఆదివాసీ మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొనాలని కోరారు.

మావల మండల కార్యవర్గం ఎన్నిక

మావల మండల ఆదివాసీ పర్ధాన్ సమాజ్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మడావి కరుణాకర్, గౌరవాధ్యక్షుడిగా మడావి నారాయణ, ప్రేంనివాస్, ఉపాధ్యక్షుడిగా మడావి రతన్, సలహాదారులుగా మెస్రం ప్రకాశ్, మడావి స్వామిదాస్, మెస్రం ప్రభాకర్, సహాయ కార్యదర్శిగా సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మడావి దత్తు, కోశాధికారిగా మడావి సంతోష్, ప్రచార కార్యదర్శిగా అరుణ్‌కుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా మెస్రం అఖిల్, సుధాకర్, అవినాశ్, కొడప రఘువీర్, కిరణ్, కిశోర్, రోషణ్ ఎన్నికయ్యారు. సమావేశంలో అడ్‌హక్ కమిటీ సభ్యులు మడావి దిగంబర్, సుభాష్, మడావి గణేశ్, దీపక్ పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ చేయండి

వంశీపై హత్యాయత్నం కేసుపై ఎస్పీని కోరిన దళిత సంఘం నాయకులు

ఎదులాపురం, జనవరి 12: మావల గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎంబడి వంశీపై ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీల చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి సభ్యులు జిల్లా ఎస్పీ గౌస్ అలంను కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధితులకు రక్షణ కల్పించాలని, తక్షణమే ప్రభుత్వం నుంచి ఆర్థిక పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కేసు విషయంలో నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, బాధితులకు రక్షణ కల్పించే బాధ్యతను తీసుకుంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు. సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ నవీన్, నాయకులు నల్ల రాజేశ్వర్, శశికాంత్, నిమ్మల ప్రశాంత్, శోభ, సత్యనారాయణ, ఈర్ల దయాకర్, సందీప్, అనిల్, వెంబడి స్వామి, మధుకర్, కృష్ణ, తదితరులున్నారు.

ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి సభ్యులు

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బోథ్, జనవరి 12: గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘంలో ఉన్న పేద మహిళలకు సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ జీవనోపాదుల మిషన్ ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుశీల అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వయం సహాయ సంఘాల మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఉన్న 12 ఎస్‌బీఐ బ్రాంచుల్లో, పొదుపులు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. సమావేశాలు నిర్వహించే సంఘాలు ఎస్‌బీఐలో రుణాలు పొంది ఉన్న ఇద్దరు మహిళా సంఘం సభ్యులను ఎంపిక చేసి వారికి మహిళలు చేపట్టే 30 ప్రధాన కార్యకలాపాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ని బట్టి స్వయం సిద్ధం కనీస రుణం రూ.లక్ష నుంచి గరిష్ట రుణం రూ.5 లక్షల వరకు ఎస్‌బీఐ ద్వారా ఇప్పించాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి, డీఆర్డీవోలకు బ్యాంక్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో మహిళలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బోథ్, జనవరి 12: బోథ్-నిర్మల్ రహదారిపై కుచులాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. బోథ్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమతి లేని వాహనాలకు ఎస్ఐ రాము జరిమానా విధించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతుల సమస్యపై వినతి

తాంసి(తలమడుగు), జనవరి 12: తలమడుగు జడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి శుక్రవారం ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను కలిశారు. తలమడుగు మండలంలో గతేడాది 60 మంది ఎస్టీ రైతులకు ట్రైబల్ ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మిగిలిపోయిన 20 మంది కోసాయి, ఉమ్రి గ్రామాల రైతులకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని రైతులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ ఎంపీటీసీ మెస్రం హనుమంతు, దత్తు పటేల్, పోశెట్టి, రైతులు ఉన్నారు.

అనుమతి లేకుండా పత్తి కొనుగోలు చేస్తే చర్యలు

ఇచ్చోడ(సిరికొండ), జనవరి 12: ప్రభుత్వ అనుమతి లేకుండా దళారులు, ఫర్టిలైజర్ షాపు యజమానులు లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇచ్చోడ మార్కెట్ కార్యదర్శి రమేశ్ హెచ్చరించారు. శుక్రవారం పొన్న, సుంకిడి, సిరికొండలో ఆయా దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరికొండలో ఓ షాపు అనుమతి లేకుండా పత్తి కొనుగోలు చేయడంతో రూ.2500 జరిమానా విధించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం, జనవరి 12 : ఆదిలాబాద్‌లోని భూక్తపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. భూక్తపూర్, ద్వారకానగర్, సినిమారోడ్డు, మోచిగల్లి పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.